మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 157 | శనివారం | 29 - 11 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## కర్నూలు మార్కెట్ యార్డును తనిఖీ చేసిన జేసీ




3లో..

# 77 అడుగుల కోదండరాముడి విగ్రహం

- ప్రపంచంలోనే ఎత్తైన రాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రధాని
- గోవా జ్యోతిర్మయ చరిత్రలో కొత్త అక్షరం
- శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జీవోత్తమ్ మఠం 550 ఏళ్ల సంబరాల్లో విశేష ఆవిష్కరణ
- రామ్ సుతార్ రూపొందించిన అద్భుత శిల్పకళపై దేశవ్యాప్తంగా ప్రశంసలు

మన గళం, గోవా : అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపనతో హిందూ సంప్రదాయానికే కొత్త దిశ చూపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మరో చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. దక్షిణ గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జీవోత్తమ్ మఠం 550వ వార్షికోత్సవాల సందర్భంగా, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి కాంస్య విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. 77 అడుగుల ఎత్తుతో నిర్మితమైన ఈ విగ్రహం కోదండరాముడి మహిమాన్వితతను ప్రతిబింబిస్తూ దేశ వ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కార్యక్రమంలో పాల్గొన్న మోదీ, అయోధ్య రామాలయంపై కాషాయం జెండా ఎగురేసిన కొద్ది రోజుల్లోనే రాముడి మరో మహా శిల్పాన్ని ఆవిష్కరించడం తనకు

2 లో..








## శ్రీలంకలో 'దిత్వా' తుఫాన్ బీభత్సం

- 56 మంది మృతి, ద్వీప దేశం అతలాకుతలం
- భారీ వర్షాలు-వరదలతో 20 జిల్లాల్లో రెడ్ అలర్ట్

మన గళం డెస్క్ : శ్రీలంకపై విరుచుకుపడుతున్న 'దిత్వా' తుఫాను పెను విధ్వంసం సృష్టిస్తోంది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రబల గాలుల కారణంగా మరణాల సంఖ్య శుక్రవారం నాటికి 56కి చేరింది. దేశవ్యాప్తంగా గృహాలు, రహదారులు, పంటలు తీవ్రంగా నష్టపోయాయి. తుపాను ప్రస్తుతం ఉత్తర-వాయవ్య దిశగా కదులుతూ తమిళనాడు తీరం వైపు దూసుకొస్తుండటంతో ఇరు దేశాల్లో ఆందోళన

2 లో..

## సీఐడీ విచారణలో హాజరైన వై.వి. సుబ్బారెడ్డి



- రెండు గంటల పాటు కొనసాగిన ప్రశ్నలు-సమాధానాలు
- "నా పదవీకాలం పూర్తయ్యాకే విషయంద వెలుగులోకి వచ్చింది" అని వైవీ వివరణ

మన గళం, విజయవాడ : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణి కేసులో దర్యాప్తు మరింత వేగం పుంజుకుంది. ఈ కేసు నేపథ్యంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి శుక్రవారం విజయవాడ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అదిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని బృందం సుమారు రెండు గంటల పాటు వైవీని ప్రశ్నించింది. విచారణ అనంతరం ఆయన నుంచి ముఖ్యమైన వివరాలను రికార్డు చేసి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. డిసెంబర్ 2వ తేదీలోగా ఈ కేసుకు సంబంధించిన నివేదికను హైకోర్టుకు

2 లో..

## బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్‌గా గెజిట్ విడుదల


- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



మనగళం, నంద్యాల : బనగానపల్లెను నూతన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, 30 రోజుల లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. గెజిట్ నోటిఫికేషన్‌ను అన్ని గ్రామ సచివాలయాలు, మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో ప్రచురించేందుకు చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేసినట్లు కూడా కలెక్టర్ తెలిపారు.

## ఆదోనిని రెండు మండలాలుగా విభజిస్తూ గెజిట్ నోటిఫికేషన్

- ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజన
- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



మనగళం, కర్నూలు సిటీ : ఆదోని మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని మండలాన్ని ఆదోని, పెద్దహరివాణం మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం జీవో ఆర్ టి. నం.1503 తేదీ 27-11-2025 ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గెజిట్ నం. 796 తో నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఆదోని హెడ్ క్వార్టర్‌గా ఆదోని మండలంలో 29 గ్రామాలు, పెద్దహరివాణం హెడ్ క్వార్టర్

2 లో..

## గండిపేటకు తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు





మనగళం, కర్నూలు సిటీ : కడప జిల్లా గండిపేటకు కర్నూలు జిల్లా నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. గండపేటలో రేపు ప్రశిక్షణ తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో కర్నూలు నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు. బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర పాదాధికారులు, జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శులు, కర్నూలు జిల్లా మండలాల అధ్యక్షులు తదితరులు గండిపేటకు వెళ్లారు.

## మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన ఎంపీ నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లాలో నిర్వహిస్తున్న రైతన్నా మీ కోసం కార్యక్రమాల గురించి మంత్రి అచ్చెన్నాయుడికి వివరించారు.

## వంశధార నీటితో ఉద్దానం- ఉత్తరాంధ్రకు కొత్త ఆశ

- గొట్టా-హిరమండలం లిఫ్ట్ ఇరిగేషన్‌లో వేగం
- సాగునీటి రంగంలో సీఎం చంద్రబాబు దూరదృష్టికి అచ్చెన్నాయుడు ప్రశంస
- 2,059.55 కోట్లతో శరవేగంగా పనులు - 50.23 భౌతిక పురోగతి



శ్రీకాకుళం, మన గళం : వంశధార నీటిని రైతులకు సమర్థవంతంగా అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గొట్టా హిరమండలం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం శరవేగంగా ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ పురోగతి పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టిని భాషిస్తూ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసలు కురిపించారు. నేరడి బ్యారేజీ నిర్మాణం ఆలస్యమైనప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఎలాంటి వెనుకడుగు వేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ భారీ పథకం

2 లో..

## శ్రీలంకలో 'దిత్వా' తుఫాన్ బీభత్సం



వ్యక్తమవుతోంది. విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం దేశంలోని 25 జిల్లాల్లో 20 జిల్లాలు తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. మొత్తం 12,000 కుటుంబాలకు చెందిన 43,000 మందికి పైగా ప్రజలు ప్రత్యక్షంగా ప్రభావితులయ్యారు. అంపారా, బట్టికలోవా, ట్రింకోమలీ, క్యాండీ, నువారా ఏలియా వంటి జిల్లాల్లో పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రజలు ఇళ్ల పైకప్పులపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకునే స్థాయికి విపత్తు విస్తరించిందని అధికారులు తెలిపారు. అనేక ప్రాంతాలు పూర్తిగా నీటమునగడంతో రవాణా వ్యవస్థ దెబ్బతిన్నది. కార్లు నీటిలో కొట్టుకుపోయిన దృశ్యాలు, రోడ్లు చెదిరిపోయిన పరిస్థితులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొండ ప్రాంతాల్లో భూమి చరియలు సంభవించడంతో అంతర్రాష్ట్ర రవాణా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో శ్రీలంక ప్రభుత్వం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు శుక్రవారం సెలవు ప్రకటించింది. అత్యవసర సేవలను యుద్ధప్రాతిపదికన వినియోగిస్తున్నట్లు అధికారులు చెప్పారు. అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే అత్యవసర సమావేశం నిర్వహించి, ప్రజా రక్షణ చర్యలకు మంత్రులు, ఎంపీలు నేరుగా మైదానంలో పనిచేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు 10 లక్షల శ్రీలంక రూపాయల పరిహారం ప్రకటించారు. ఇదిలాఉండగా, శ్రీలంక అభ్యర్థన మేరకు భారత్ సహాయక చర్యల కోసం ముందుకు వచ్చింది. కొలంబోలో ఉన్న భారత నౌకాదళ నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి హెలికాప్టర్లను పంపేందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది. భారత్ అందిస్తున్న మానవతా సహాయం శ్రీలంకలో ఆశను నింపుతున్నట్లు స్థానిక మీడియా పేర్కొంటోంది.

## సీఐడీ విచారణలో హాజరైన వై.వి. సుబ్బారెడ్డి

సమర్పించాల్సి ఉండటంతో సీఐడీ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇప్పటికే మాజీ ఈవో ధర్మారెడ్డి, అప్పటి సీఎస్వో నరసింహ కిశోర్‌ల నుంచి కూడా వివరాలు సేకరించారు. తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న పత్రాలను విజయవాడ సీఐడీకి తరలించడం ద్వారా విచారణలో స్పష్టతకు దోహదమవుతుందని అధికారులు తెలిపారు. పరకామణి లెక్కలు, భద్రతా వ్యవస్థ, బాధ్యత వహించాల్సిన అధికారులపై వివరణాత్మక సమాచారం సేకరణ కొనసాగుతోంది. విచారణ అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, సీఐడీ అడిగిన ప్రతి ప్రశ్నకు తాను సమాధానమిచ్చానని తెలిపారు. "నా హయాంలో దొంగతనం జరిగిందా? అని నన్ను అడిగారు. కానీ ఆ విషయం నా పదవీకాలం ముగిసిన తర్వాతే వెలుగులోకి వచ్చింది. అప్పట్లో ఈ విషయాన్ని ఎవరు దాచారో నాకు తెలియదు అని స్పష్టంగా చెప్పాను" అని తెలిపారు. సంఘటనా సమయంలో ఉన్న విధానాలు, భద్రతా నిర్వాహణ, బాధ్యతల పంపిణీపై కూడా అధికారులకు తెలియజేశానని చెప్పారు. ఈ విచారణను రాజకీయంగా ఉపయోగించకూడదని, నిజం బయటకు రావడమే తనకున్న కోరిక అని సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. నిష్పక్షపాత దర్యాప్తు జరిగి అసలు దోషులు శిక్షించబడాలని కోరుతూ, తాను ఎల్లప్పుడూ అధికారులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. టీటీడీ పరకామణి కేసు నేపథ్యంలో వెలుగులోకి వస్తున్న కొత్త వివరాలతో దర్యాప్తు మరింత కీలక దశలోకి ప్రవేశించింది.

## 77 అడుగుల కోదండరాముడి విగ్రహం



దక్కిన సౌభాగ్యమని పేర్కొన్నారు. గోవా ఆధ్యాత్మిక వారసత్వంలో జీవోత్తమ్ మఠం శతాబ్దాలుగా కీలక కేంద్రంగా నిలుస్తుండగా, ఈ మహావిగ్రహం ఆ సంప్రదాయాన్ని మరింత వెలుగులోకి తెస్తోందని ఆయన అన్నారు. రాముడి జీవితం, ధర్మం, న్యాయం, ధైర్యం ఇవన్నీ భారతీయ సంస్కృతికి పునాది అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ అద్భుత కాంస్య విగ్రహాన్ని ప్రముఖ శిల్పకారుడు రామ్ సుతార్ రూపకల్పన చేశారు. సర్దార్ పటేల్ "స్టాచ్యూ ఆఫ్ యూనిటీ" వంటి ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణాలను తీర్చిదిద్దిన రామ్ సుతార్ శిల్పకళ మరోసారి తన ప్రతిభను ప్రపంచానికి చాటింది. ఆధునిక ఇంజనీరింగ్, సంప్రదాయ కళాత్మకత, విశిష్టమైన ఆకృతీకరణ భారతీయ ఆధ్యాత్మికత, కళ, వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయడంలో ఈ విగ్రహం ఎంతో ముఖ్యమైన పాత్ర వహించనుందని కేంద్రం భావిస్తోంది. యాత్రికులు, పర్యాటకులు మాత్రమే కాక దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఈ విగ్రహం కేంద్ర బిందువుగా మారనుంది.

# వంశధార నీటితో ఉద్దానం-ఉత్తరాంధ్రకు కొత్త ఆశ

మొత్తం అంచనా వ్యయం ?2,059.55 కోట్లుగా నిర్ణయించగా, ప్రస్తుతం 50.23% భౌతిక పురోగతి నమోదు చేసినట్టు అచ్చెన్నాయుడు తెలిపారు. వంశధార నీటిని ఎత్తిపోసేందుకు 6300 కలిగిన నాలుగు భారీ పంపులు వినియోగిస్తున్నారని, రోజుకు భారీ స్థాయిలో నీటి రవాణా సాధ్యమవుతుందని చెప్పారు. వ్యవసాయ రంగంలో నీటి కొరతను అధిగమించేందుకు ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుంది. పథకం పూర్తయ్యే సరికి 2.30 లక్షల ఎకరాల ఖరీఫ్ ఆయకట్టు స్థిరీకరణతో పాటు అదనంగా 2 లక్షల ఎకరాల రబీ సాగుకు నీరు అందుతుందని తెలిపారు. వర్షాలపై ఆధారపడే ఉత్తరాంధ్ర వ్యవసాయ వ్యవస్థకు ఈ ప్రాజెక్ట్ రెక్కలుదన్నుతుంది. వ్యవసాయ ఉత్పత్తి పెరగడం ద్వారా రైతుల ఆదాయాలు గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయంతో పాటు ప్రజారోగ్య రంగానికీ ఈ పథకం ఆశాకిరణంగా నిలుస్తోంది. ఉద్దానం ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న 4.69 లక్షల మందికి సురక్షితమైన తాగునీటి సరఫరా ఈ ప్రాజెక్ట్ ద్వారా సాధ్యమవుతుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛమైన నీటి కొరతే ఆ వ్యాధులకు ప్రధాన కారణమని నిపుణుల విశ్లేషణ ఉండగా, ఈ ప్రాజెక్ట్ ఆ దిశగా ఉపశమనం కలిగించనున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో లక్షలాది మంది రైతులు, ఉద్దానం ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఈ ప్రాజెక్ట్‌ను సకాలంలో పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. అమలు వేగం కొనసాగితే ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఈ పథకం ఒక మైలురాయిగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## ఆదోనిని రెండు మండలాలుగా విభజిస్తూ గెజిట్ నోటిఫికేషన్

గా పెద్దహరివాణం మండలంలో 17 రెవెన్యూ గ్రామాలను ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆదోని మండలంలో ఆదోని, కల్లుబావి, వెంగళాపురం, పర్వతాపురం, మండిగిరి, ఎస్.కొండాపురం, ఇస్వీ, గోనబావి, దిబ్బనకల్లు, నెట్టేకల్లు, ఆరెకల్, బైచిగేరి, సలకలకొండ, విరుపాపురం, దొడ్డనకేరి, సాంబగల్లు, హువ్వనూరు, కపటి, బసరకోడు, చిన్న పెండేకల్లు, బల్లేకల్లు, మాంత్రికి, దెయ్యాలగూడెం, పాండవ గల్లు, కుప్పగల్లు, జాలిమంచి, సుల్తానాపురం, పెసలబండ, పెద్దతుంబళం గ్రామాలు ఉంటాయన్నారు. అదేవిధంగా పెద్దహరివాణం మండలంలో పెద్దహరివాణం, సంతేకూడ్లురు, యడవల్లి, బలదూరు, చిన్నగోనెహాలు, చిన్నహరివాణం, మదిరె, కడితోట, హానవాళు, జి. హొసళ్లి, బసాపురం, వి.కొండాపురం, నాగనాథనహళ్లి, నారాయణపురం, చాగి, ఢణాపురం, గణేకల్లు గ్రామాలతో మండలాల ఏర్పాటును ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని 30 రోజుల లోపు కర్నూలులో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఈహెచ్ఎస్ సమస్యలకు పరిష్కారం

# దిశగా ప్రభుత్వం కీలక అడుగు

**- ఏడుగురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు - 8 వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం**

మన గళం, అమరావతి : ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాల ఆరోగ్య రక్షణకు కీలకమైన ఈహెచ్ఎస్ పథకంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయాత్మక ముందడుగు వేసింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పథకం అమలులో ఉన్న లోపాలు, జాప్యాలు, రీయింబర్స్‌మెంట్ సమస్యలు వంటి అంశాలపై ఈ కమిటీ ఎనిమిది వారాల్లోగా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి. కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చైర్మన్‌గా నియమితులయ్యారు. జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యయ విభాగ కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈవోతో పాటు రెండు ఉద్యోగ సంఘాల ప్రతినిధులను కమిటీలో చేర్చడం ద్వారా ఉద్యోగుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇటీవల ఉద్యోగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయి ఈహెచ్ఎస్ సమస్యలను వివరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ హామీ అమలులో భాగంగానే కమిటీ ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయంపై ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్, ఏపీఎన్జీవో సంఘం ప్రధాన కార్యదర్శి డీవీ రమణ హర్షం వ్యక్తం చేశారు. వైద్య బిల్లుల ఆమోదంలో నెలకొన్న తీవ్రమైన జాప్యాన్ని తొలగించడానికి సమర్థమైన యంత్రాంగం అవసరమని వారు అభిప్రాయపడ్డారు. జిల్లాల వారీగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ. 50,000 నుంచి రూ. 1 లక్షకు పెంచాలని, ఈహెచ్ఎస్ కవరేజీని ప్రస్తుత రూ. 2 లక్షల నుంచి కనీసం రూ. 5 లక్షల వరకు విస్తరించాలని కోరారు. అదనంగా, పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగులకు కూడా ఆరోగ్య కార్డులు అందించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. 2013లో ప్రారంభమైన ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ప్రస్తుతం 24 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. అయితే ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యం, ప్యాకేజీ ధరలు పాతబడిపోవడం వల్ల నెట్‌వర్క్ ఆసుపత్రులు సేవలు అందించేందుకు నిరాసక్తత చూపుతున్నాయని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ సమస్యలన్నింటికి కమిటీ పరిశీలనతో శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 20 వేల ఎకరాల భూ సమీకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

## ప్రపంచ స్థాయి అమరావతికి రైతుల ఐక్యత అత్యవసరమని సీఎం చంద్రబాబు పిలుపు



మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక దశ ప్రారంభమైంది. ప్రపంచ స్థాయి, ఆధునిక రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే లక్ష్యంతో రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో 16,666 ఎకరాల భూమిని ఏడు గ్రామాల పరిధిలో సమీకరించాలని నిర్ణయించారు. ప్రభుత్వ భూములను కలుపుకొని మొత్తం 20,494 ఎకరాల భూమి రెండో దశలో అందుబాటులోకి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడుగ్రామాల్లో భూముల వివరాలను కేబినెట్ సమగ్రంగా పరిశీలించింది. వైకుంఠపురం 3,361 ఎకరాలు, పెదపరిమి 6,513 ఎకరాలు, కర్లపూడి 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురం 2,418 ఎకరాలు, ఎంద్రాయి 2,166 ఎకరాలు, వడ్డమాను 1,913 ఎకరాలు, పెదమద్దూరు 1,145 ఎకరాలు సమీకరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే సేకరించిన ప్రభుత్వ, అసైన్డ్ భూములు కలుపుకొని మొత్తం 20,494 ఎకరాలన్న కేబినెట్ అంచనా. ఇవన్నీ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ద్వారా చేపడతారు. మొదటి దశలో సుమారు 34,000 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. రెండో దశలో మరో 20,000 ఎకరాలు మరియు అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమి కలిపి మొత్తం దాదాపు 70,000 ఎకరాలు రాజధాని అభివృద్ధికి సిద్ధమవుతున్నాయి. విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, రైల్వే స్టేషన్ వంటి భారీ నిర్మాణాలకు, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇవి అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, గురువారం సచివాలయంలో రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ చర్చల్లో, అమరావతి అభివృద్ధికి రైతులు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన కోరారు. "రైతుల ఐక్యత లేకపోతే అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుంది" అని ముఖ్యమంత్రి సున్నితంగా హెచ్చరించారు. చిన్న చిన్న విభేదాలు, జేఏసీల పేరుతో గందరగోళం సృష్టించకుండా ఒకే 'అమరావతి అభివృద్ధి కమిటీ'గా ఏర్పడి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేబినెట్ ఆమోదంతో రెండో దశ ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ త్వరలో విడుదలయ్యే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. అమరావతి నిర్మాణం దిశగా ఈ నిర్ణయం మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను నెరవేరుద్దాం

**– చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి – డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్**






మనగళం, కర్నూలు సిటీ : మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా కర్నూలు బిర్లా గేట్ లోని ఆయన విగ్రహానికి బీసీ నాయకులు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. బీసీ నాయకులు డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నక్కల మిట్ట శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు సత్రం రామకృష్ణ బీసీ శేషగిరి సుజాత, రామకృష్ణుడు, జీవీ కృష్ణయ్య తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసీలు విద్యా, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరంగా మిగతా వర్గాల వారితో తీసిపోకుండా జీవించాలనేదే జ్యోతిరావు పూలే గారి ఆశయం అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తూ చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మహిళా బిల్లు నందు బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయించాలని కోరారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్ల నందు రిజర్వేషన్లు కల్పించాలి అనే విషయాలపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోరాటాలు చేస్తున్నామన్నారు. ఆ పోరాటలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 24 శాతం మాత్రమే బీసీ లకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. ఇప్పటి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు 34 శాతంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని మాట ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఆ మాటకు కట్టుబడి ఉండవలసిందిగా ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు గారిని విన్నవించుకుంటున్నామన్నారు. అలాగే లోకేష్ పాదయాత్రలో బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తానని తెలిపారని గుర్తు చేశారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాల్సిందిగా ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగర పరిధిలోని మద్దూర్ నగర్ కార్యాలయంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక కార్యాలయంలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు చదువుకోవాలని సూచించిన మహనీయుడు పూలే అన్నారు.
బాలికలకు,మహిళలకు విద్య నేర్పించి, తన భార్య సావిత్రిభాపూలేను మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సమాజంలో చెరగని స్థానాన్ని కల్పించారని గుర్తు చేశారు. 1888 మే 11వ తేదీన వేలాది మంది సమక్షంలో మహాత్మా అనే బిరుదును ప్రజలే ఆయనకు ఇచ్చారన్నారు. సామాజిక మార్పుకోసం ఎంతో కృషిని చేసిన పూలే ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజలు ఆదర్శంగా తీసుకొని ఆయన ఆలోచన విధానాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐక్య వేదిక సభ్యులు రేవతి,చిరంజీవమ్మ పాల్గొన్నారు.

# టీచర్లకు సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించండి

మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రం లో పని చేయుచున్న ఉపాధ్యాయులకు గత ప్రభుత్వ హయాంలో 2022 నుండి సరెండర్ లీవ్ బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ ద్వారా వివరించామన్నారు. వాస్తవానికి ఉపాధ్యాయులది వెకేషన్ డిపార్ట్మెంట్ కాబట్టి సంవత్సరానికి 6 మాత్రమే సరెండర్ లీవ్ లు వస్తాయని, వాటిని సొమ్ము గా మార్చుకోవడానికి వెళితే సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్నాయన్నారు. 2023 సంవత్సరం నవంబర్ లో విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు దృష్టిలో ఈ విషయాన్ని ఉంచినపుడు మీతోపాటు పోలీసులకు 2024 సంక్రాంతి కి చెల్లిస్తాం అని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని కోరారు.

# రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ రెడ్డి

**– కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**



మనగళం, కర్నూలు సిటీ : రాష్ట్రంలో అధికారంలో ఉండ గా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ మోహన్ రెడ్డి పార్టీని రద్దు చేసుకొని బెంగళూరు ప్యాలెస్ కి వెళ్లి అక్కడ కర్ణాటక లో రాజకీయాలు చేయాలని తెలుగుదేశం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2019 నుండి 24 వరకు అధికారంలో కొనసాగిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశారని, వారితో పాటు వైసిపి నాయకులు మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు పోటీపడి ప్రజల సొమ్మును అడ్డంగా దోచుకున్నారని విమర్శించారు. ఇసుక, మద్యం, మైనింగ్, భూ దందాలు వంటి మాఫియాలు అడ్డంగా దోచుకోవడం జరిగింది. గమనించిన రాష్ట్ర ప్రజలు గత 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కుటమికి ఎన్నడూ లేని విధంగా 164 స్థానాలలో గెలిపించుకుని అధికారాన్ని అప్పగించారని చెప్పారు. 2024లో అధికారంలోకి వచ్చి 18 నెలల కాలంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పదం వైపు తీసుకు వెళుతున్నారని, ముఖ్యంగా ప్రధాని మోడీ రి సహకారంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ అనునిత్యం ప్రజల కోసం కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తెప్పించి రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ , ఉపాధి అవకాశాలను కల్పించడంలో అవిశ్రాంతంగా కృషి చేయుచున్నారన్నారు. అదేవిధంగా చంద్రబాబు నాయుడు విదేశీ పెట్టుబడులను రాబట్టడంలో తనకున్న అనుభవాన్ని ఉపయోగించుకొని రాష్ట్ర అభ్యున్నతికై పాటుపడుతున్నారని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు సూపర్ సిక్స్ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందడం జరిగిందన్నారు. అయితే దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను తప్పుదారి పట్టించి మరోసారి అధికారంలోకి రావాలని తప్పుడు ఆరోపణలు చేస్తూ చాటు మాటుగా పత్రికలకు ప్రకటనలు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ముందుకు రాకుండానే అబద్ధం ప్రచారంతో కాలంగడుపుకుంటూ అధికార పక్షంపై నిందలు వేస్తున్నారని అన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఎంతో మంది అధికారులు ఇరువురు చెప్పినట్లు తల ఊపి చేసిన తప్పులకు జైలు పాలు అయ్యారని గుర్తు చేశారు. అయితే జగన్మోహన్ రెడ్డి మరలా తానే అధికారంలోకి వస్తానని, అధికారులను బ్లాక్ మెయిల్ చేసే విధంగా మాట్లాడుతుండడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. జగన్ రెడ్డి అహంకార ధోరణికి నిదర్శనమని అన్నారు. తాను అధికారంలో ఉండగా చేసిన అరాచకాల గురించి ప్రజలు ఇంకా మర్చిపోలేదని, జగన్ అవినీతితో సంపాదించిన డబ్బుతో తాడేపల్లి, బెంగళూరు, హైదరాబాద్, లండన్ మొదలగుచోట్ల ప్యాలెస్లు కట్టారని ఆరోపించారు. ఇక రాష్ట్ర రాజకీయాలకు స్వస్తి పలికి వైసీపీ పార్టీని రద్దు చేసుకొని బెంగళూరులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని కర్ణాటకలో రాజకీయాలు చేయాలని సూచించారు.

# కర్నూలు మార్కెట్ యార్డును తనిఖీ చేసిన జేసీ





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు మార్కెట్ యార్డును శుక్రవారం జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మార్కెట్ యార్డు ప్రాంగణం, డైనింగ్ హాల్, వాష్‌రూమ్‌లు, మినరల్ వాటర్ ప్లాంట్లు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. మార్కెట్ యార్డును శుభ్రంగా నిర్వహించాలని, ప్రతిరోజూ చెత్తను తొలగించాలని సూచించారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ మార్కెట్ యార్డు కార్యదర్శి జయలక్ష్మిని ఆదేశించారు.

# కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాంగ్రెస్ కేంద్ర కమిటీ పరిశీలకులు హెచ్ సి యోగేష్ గారు తెలియజేశారు. శుక్రవారం ఏపీసిసి పరిశీలకులు సాకే శంకర్, సొంటి నాగరాజుతో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేశారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశలో భాగంగా ప్రతి జిల్లా, నగర కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామక ప్రక్రియ చేపట్టామన్నారు. శనివారం ( 29:11:2025) సాయంకాలం నాలుగు గంటల నుండి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర కమిటీ పరిశీలకులు అందుబాటులో ఉంటామన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో అభివృద్ధి చేసి పార్టీ సిద్ధాంతాలకు, విలువలకు కట్టుబడి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ఆసక్తి గల ఆశావహులు కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకోవచ్చని యోగేష్ తెలియజేశారు.

# జర్నలిస్ట్స్ అసెంబ్లీని నిర్వహించండి



మనగళం, కర్నూలు సిటీ : విద్యార్థులతో అసెంబ్లీని నిర్వహించినట్లు జర్నలిస్టులతో కూడా అసెంబ్లీ నిర్వహించాలని సీనియర్ జర్నలిస్ట్ కొత్తూరు సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారిధిగా ఉండే పాత్రికేయులకు ఒక అవకాశం కల్పించాలని కోరారు. ప్రజల కష్టాలు ప్రభుత్వానికి తెలిపేందుకు ఒక వేదిక అవుతుందని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు కూడా చేరువ అయ్యేందుకు కూడా వీలవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈ తరహా అసెంబ్లీ నిర్వహించడం వల్ల వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ప్రభుత్వ పనితీరు కూడా మెరుగుపడ్డానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంతోమంది నిజాయితీగల పాత్రికేయులు ఉన్నారని, నిజాయితీ గల నేతలను పాలన ఏ విధంగా ఉంటుంది ప్రజలకు కూడా తెలుసుకునే అవకాశముంటుందన్నారు. తనకు కూడా ఒక స్వతంత్ర అభ్యర్థిగా శాసనసభ్యుడుగా ఎన్నికైనట్లుగా లేదా ముఖ్యమంత్రి పదవితో కూడిన అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఒకరోజు ముఖ్యమంత్రిగా ఎలా ఉంటుందో చూపిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో అభివృద్ధి ఫలాలు ఏ విధంగా ఉన్నాయి... అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు... ప్రభుత్వం చేపట్టాల్సిన విధులు పాత్రికేయుల అసెంబ్లీతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చి అవకాశం ఉంటుందన్నారు.

# కానిస్టేబుల్ అభ్యర్థులకు ట్రైనింగ్ ఇవ్వాలి

మనగళం, కర్నూలు సిటీ : పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చి వెంటనే జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి నాగేష్ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2022 నవంబర్లో నోటిఫికేషన్ వచ్చి 60 రోజులకే ప్రిలిమినరీ పరీక్షలు రాసి తర్వాత వైసీపీ ప్రభుత్వం మెయిన్స్ ఈవెంట్స్ పెట్టకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. డీవైఎఫ్ఐ గా అనేకసార్లు ఆందోళన చేయడంతో టీడీపీ కూడా ప్రభుత్వం వచ్చాక మెయిన్స్ ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించి రిజల్ట్స్ విడుదల చేశారని, అయితే ఇంతవరకు సెలెక్ట్ అయిన అభ్యర్థులకు ట్రైనింగ్ ఇవ్వకుండా జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే మూడు సంవత్సరాల నుండి అభ్యర్థులు ఇబ్బందులకు గురై టిడిపి కూటమి ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చి వెంటనే జాయినింగ్ లెటర్ ఇవ్వాలని, లేదంటే అభ్యర్థులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామనేసి ప్రభుత్వానికి హెచ్చరించారు.



# ధర్మాచరణతోనే వ్యక్తి వికాసం





మనగళం, ఆస్పరి : ధర్మాచరణం ద్వారానే వ్యక్తి వికాసంతోపాటు సమాజ అభ్యుదయం జరుగుతుందని, ధర్మాచరణమే సర్వాంగీన వికాసానికి కారణభూతమని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మా ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆస్పరి మండలం, కారుమంచి గ్రామంలోని జ్యోతిమూర్తి శ్రీ దక్షిణామూర్తి స్వామి ఆశ్రమం నందు గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలతోపాటు గ్రామములో శోభాయాత్రగా నగర సంకీర్తన నిర్వహించారు. మూడు రోజులు పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు పాయసం పెద్ద రంగారెడ్డి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో తితిదే ధర్మ ప్రచారమండలి సభ్యులు న్యాయకంటి భీమిరెడ్డి, సర్పంచ్ సి.లక్ష్మిదేవి కౌలుట్ల, మాజీ జడ్పీటీసీ మురలీమోహన్ రెడ్డి, గ్రామ పెద్దలు కె.రవి ప్రకాశ్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, ఈరన్న, రంగయ్య, దేవేంద్ర, రంగస్వామి, సత్యనారాయణ రెడ్డి, గోవిందు, సుధాకర్ స్వామి, హరీష్ గౌడ్, మల్లి గౌడ్, లక్ష్మీదేవి, శ్రీవారి సేవకులు సోమిరెడ్డి, రాధారెడ్డి, అరుణ, లలిత, లక్ష్మి, అనుపమ, శ్రీదేవి నాగరత్నమ్మతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

**– మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు**



మనగళం, కర్నూలు సిటీ : అణగారిన వర్గాల ఆశాజ్యోతి మన జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు కొనియాడారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ కులం పేరుతో తరతరాలుగా అణచి వేతకుగురెట్కన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు మన జ్యోతిరావు పూలే అన్నారు. 1873 సెప్టెంబరు 24న జ్యోతిరావుపూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశాడని గుర్తు చేశారు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో జ్యోతిరావుపూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డారని చెప్పారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షుడు ఆర్ ప్రతాప్ సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులు డబ్ల్యూ సత్యరాజు, కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం, షేక్ మాలిక్ బాషా, కేశవరెడ్డి, శివానంద, జాన్ సదానందం, శేఖర్, జమ్మన్న, ఇలియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఆస్తులు దాచిపెట్టిన వారిపై ఐటీ శాఖ కఠిన దృష్టి

న్యూఢిల్లీ, నవంబర్ 28 %-%మనగళం,. విదేశాల్లో కలిగిన ఆస్తులను పన్ను రిటర్నుల్లో ప్రస్తావించకుండా దాచిపెట్టిన వ్యక్తులపై ఆదాయ పన్ను శాఖ కఠిన వైఖరి ఎత్తుకుంది. 2025%-%26 ఆర్థిక సంవత్సరానికి గాను వ్యక్తిగత రిటర్నులు దాఖలు చేసిన వారిలో, విదేశీ ఆస్తుల వివరాలు ఇవ్వని దాదాపు ఇరవై అయిదు వేల మందిని ప్రత్యేకంగా గుర్తించినట్లు శాఖ వర్గాలు వెల్లడించాయి. పన్ను చట్టాల ప్రకారం తప్పనిసరి అయిన ఈ వివరాలను దాచిపెట్టిన వారికి ఈ నెల 28 నుంచి శాఖ ఈ%-%మెయిల్, ఎస్ఎంఎస్ రూపాల్లో అధికారిక గమనికలు పంపనుంది.

విదేశీ భూములు, ఖాతాలు, పెట్టుబడులు వంటి కీలక ఆస్తులు దాచినవారు వెంటనే తమ రిటర్నులను సవరించి డిసెంబర్ 31లోపు తిరిగి సమర్పించాలని శాఖ హెచ్చరికల్లో స్పష్టం చేసింది. నోటీసులు అందుకున్న వారు ఈ గడువులోగా రిటర్నులను తిరిగి సమర్పించకపోతే తీవ్ర చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు చెబుతున్నారు. పన్ను శాఖ ఇప్పటికే పలువురు సంస్థలను సంప్రదించి, వారి ఉద్యోగుల్లో విదేశీ ఆస్తులు కలిగి ఉన్నవారి వివరాలను సేకరించినట్లు సమాచారం.

# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి




మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు ఆర్డీవో కార్యాలయం ముందు భూ నిర్వాసితుల కమిటీ ఆధ్వర్యంలో బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఓర్వకల్ మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి భూ నిర్వాసితుల కమిటీ నాయకుడు నాగన్న మాట్లాడుతూ ఏపీఐఐసీలో భూములు కోల్పోయి ఏండ్ల తరబడి అవుతున్నా నష్టపరిహారం చెల్లించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓర్వకల్లు మండలంలో పరిశ్రమల హబ్బుగా ఏర్పాటు చేసి 30 వేల ఎకరాలకు పైగా భూములు సేకరించారని, అందులో ఏపీఐఐసీ పేరుతో పదివేల ఎకరాలకు పైగా భూములు అభివృద్ధి చేస్తున్నారన్నారు. వాటిలో మీదివేముల రైతుల భూములు ప్రభుత్వం తీసుకుందని, అయితే అనేకమందికి ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పెద్దల కాలం నుండి భూములను సాగు చేస్తున్నారని, ఆ భూములకు గతంలో అనేకమందికి పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేశారన్నారు. కొంతమందికి పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వలేదని, పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిన వారికి కూడా కొంత భూమికి మాత్రమే నష్టపరిహారం చెల్లించి మిగతా భూములకు ఇవ్వలేదన్నారు. కర్నూలు ఆర్డీవో స్పందించి ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతుల భూములను పరిశీలించి పట్టా కలిగిన, సాగు చేస్తున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హరి, సర్వాల ఎల్లయ్య, కృష్ణవేణమ్మ, నాగమ్మ, ఎల్లయ్య, మద్దిలేటి, ఎర్రమల, వెంకటేశ్వర్లు, శేఖర్, గోపాల్, లక్ష్మన్న, సుబ్బమ్మ, శ్రీదేవి, పుణ్యవతి ,శివమ్మ, ఎల్లమ్మ, సామేలు తదితరులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్త వేర్వేరు చేసి ఇవ్వండి

**– నగర ప్రజలకు కమిషనర్ పి.విశ్వనాథ్ సూచన**





మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర ప్రజలు తమ గృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయాల్లో వెలువడే వ్యర్థాల్లో తడి%-%పొడి చెత్తా వేర్వేరు చేసి, నగరపాలక సిబ్బందికి ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. శుక్రవారం గార్గేయపురం డంప్‌యార్డును ఆయన సందర్శించారు. యంత్రాలు, వర్మికంపోస్టు పిట్స్, కంపోస్టు తయారీ యూనిట్, కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం, చెత్త వర్గీకరణ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా నెహ్రూ రోడ్డున బిటి రహదారి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రతిరోజు తడి పొడి చెత్తను వేరు చేసి డంపు యార్డులో చెత్తను తగ్గించాలని సూచించారు. శునకాలకు ఆహారం, శుభ్రత, వాతావరణం తగ్గట్టు పరిసరాలు వంటి చర్యల్లో నిర్లక్ష్యం చేయొద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డంప్ యార్డుకు చేరుతున్న చెత్తలో పెద్ద మొత్తంలో మిశ్రమ వ్యర్థాలు ఉండడం కారణంగా రీసైక్లింగ్ వ్యవస్థపై భారం పెరుగుతోందని పేర్కొన్నారు. తడి చెత్త వ్యర్థాలతో కూడిన పదార్థాలుగా గుర్తించి రోజూ వేరు చేయాలని, పొడి చెత్తను ప్లాస్టిక్, పేపర్, గ్లాస్ వంటి రీసైక్లింగ్‌కు అనువైన వస్తువులుగా విడిగా ఇవ్వాలని సూచించారు. డంప్ యార్డు వద్ద పొడి చెత్తలోని డబ్బాలు, అట్టముక్కలు, ఇతర వస్తువులను డీఆర్‌సీసీకి తరలించాలన్నారు. తడి చెత్తను గార్గేయపురం డంప్ యార్డులో ఉన్న వర్మికంపోస్టు పిట్స్ ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్చాలన్నారు. సెగ్రిగేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి డంప్ యార్డుకు వెళ్లే చెత్తను పూర్తిస్థాయిలో తగ్గించాలన్నారు. నగరవ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను కార్మికులు తప్పకుండా సేకరించి వంద శాతం సెగ్రిగేషన్ చేయాలని ఆదేశించారు. పరిశుభ్రమైన కర్నూలు నిర్మాణంలో ప్రతి పౌరుడూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. తడి చెత్తా 8 టన్నులు వస్తుందని, మిశ్రమ చెత్తా 250 టన్నుల వరకు ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. గత నెల 20 నుండి ప్రారంభమైన మూడో విడత శునకాల సంతాన నిరోధక చికిత్సలు ఇప్పటికీ 550 అయ్యాయని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదకరమైన వీధి శునకాలను గార్గేయపురం డంప్‌యార్డుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్%ఏ%డి డిఈఈ ఫినిరాం, డిఈఈ క్రిష్ణలత, వెటర్నరీ డాక్టర్ మల్లన్న, తదితరులు పాల్గొన్నారు.


# సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్లను సక్రమంగా నిర్వహించాలి

**– విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు, రక్షణ విషయం లో జాగ్రత్తగా ఉండాలి – కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి**




మనగళం, కర్నూలు సిటీ : సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో హాస్టల్స్ నిర్వహణపై సంక్షేమ శాఖల అధికారులు, డీఈఓ, రెసిడెన్షియల్ స్కూళ్ల కో ఆర్డినేటర్లు, కేజీబీవి ల స్పెషల్ ఆఫీసర్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్ల లో విద్యార్థులు వసతుల లేమి తో ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. హాస్టళ్ల లోపల, బయట పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. టాయిలెట్లను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంట గదిలో పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులకు తాజా కాయగూరల తో ఎప్పటికపుడు భోజనం తయారుచేసి వేడి పదార్థాలను అందించాలన్నారు. బయట నుంచి ఆహార పదార్థాలను తెప్పించకూడదన్నారు. తాగు నీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. అలాగే తాగు నీటిని టెస్ట్ చేయించాలన్నారు. హాస్టళ్లలో టాయిలెట్స్ మరమ్మతులకు సంబంధించి ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో సీఎస్సార్ నిధులు లేదా డీఎంఎఫ్ నిధులతో చేయిస్తామని, బీసీ, ఎస్సీ హాస్టళ్లలో టాయిలెట్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. ఇంకా ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తగిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హాస్టళ్లకు ఏ ఎన్ ఎం లు 15 రోజులకు ఒకసారి వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించాలని, అలా జరగక పోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే స్పందించి వైద్యుల దగ్గరకు తీసుకువెళ్లాలన్నారు. చివరి వరకు అలాగే ఉంచి, బాగోలేని పరిస్థితిలో ఇంటికి పంపించకూడదన్నారు. అలా పంపితే, ఆలస్యమై మరింత అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. అవసరం అయితే హాస్పిటల్ లో అడ్మిట్ చేయించాలని సూచించారు. విద్యార్థులు అనారోగ్య పరిస్థితుల్లో ఉంటే డిస్ట్రిక్ట్ హెడ్స్ కు సమాచారం అందించాలన్నారు. టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాధిక, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, డీఈఓ శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## డైరెక్టర్ రామగిడ్డయ్యకు ఘన సన్మానం



మనగళం, కర్నూలు : సగర, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి రామగిడ్డయ్యను ఘనంగా సన్మానించారు. విజయవాడ బీసీ భవన్ లో సగర, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ గా ఉప్పరి రామగిడ్డయ్య ప్రమాణ స్వీకారం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ సగర, ఉప్పర సంక్షేమం, అభివృద్ధి, కార్పొరేషన్ మార్గదర్శకాల ప్రకారం విధి విధానాలను అమలు చేస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని చెప్పారు. అదేవిధంగా సగర, ఉప్పర సమాజిక వర్గాల అభివృద్ధికి తనవంతు పాటుపడుతానన్నారు. అనంతరం ఉప్పరి రామగిడ్డయ్య దంపతులను స్నేహితులు, సన్నిహితులు, బంధువులు ఘనంగా సత్కరించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## పాలస్తీనా ప్రజలతో ఐక్యత దినం। న్యాయం కోసం అర్ధశతాబ్దం పైగా సాగుతున్న ప్రపంచపు నిశ్శబ్ద పోరాటం

- పాలస్తీనా విషాదానికి అంతర్జాతీయ వేదిక
- శాంతి, భూభాగం, హక్కుల మధ్య చిక్కుకున్న ప్రజలు
- ప్రపంచ మనసాక్షి నిలబడాల్సిన సమయం

ప్రతి సంవత్సరం నవంబర్ ఇరవై తొమ్మిదో తేదీ వచ్చినప్పుడల్లా ప్రపంచ క్యాలెండర్‌లో ఒకే ఒక అంశం అత్యంత గాఢమైన నిశ్శబ్దంతో మన కళ్ల ముందుకు నిలబడుతుంది. పాలస్తీనా ప్రజలతో ఐక్యత దినం. ఇది కేవలం ఒక గుర్తింపు రోజేగాదుబీ ఇది ప్రపంచం ఇంకా పూర్తి చేయని బాధ్యతల జాబితాలో అతి ముఖ్యమైన అంశానికి ఒక శక్తివంతమైన గుర్తు. ఏడు దశాబ్దాల కన్నా ఎక్కువకాలం ఒక జాతి అన్యాయం, భూభాగం కోల్పోవడం, శరణార్థితనం, యుద్ధం, ఆంక్షలు, అంతర్జాతీయ రాజకీయ ప్రయోగాలు, సుదీర్ఘ ఘర్షణల మధ్య జీవించడానికి బలవంతం చేయబడింది. ఆ కథ మనం ఎంతసార్లు విన్నా అది ఇంకా ముగియలేదు పాలస్తీనా సమస్య ప్రపంచ రాజకీయాలలో అత్యంత సంక్లిష్టమైనదిగా మారడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఒకపక్క భూభాగ చరిత్ర, మరోపక్క మతపరమైన భావజాలం, దానికి తోడు శీతలయుద్ధం నుండి నేటి వరకు మారుతున్న అంతర్జాతీయ శక్తుల సమీకరణాలు ఇవన్నీ కలిసి పాలస్తీనా ప్రజల జీవితాన్ని ఒక బంధనంగా మార్చాయి. ఐక్యరాజ్యసమితి అనేక తీర్మానాలు ఆమోదించింది. రెండు దేశాల పరిష్కారం గురించి ప్రపంచ నాయకులు అనేకసార్లు మాటిచ్చారు. శాంతి ఒప్పందాలకు ప్రయత్నాలు జరిగాయి. మధ్యప్రాచ్య శాంతి సమావేశాలకు ఎన్నో దేశాలు హామీలు ఇచ్చాయి. కానీ నేలపై పరిస్థితి మాత్రం మారలేదు. ఒక ఇల్లు కూడా నిర్మించుకోలేని స్థితి, రోజువారీ భద్రతకూ హామీ లేని పరిస్థితి, విద్యా అవకాశాలపై ఆంక్షలు, ఆర్థిక అవకాశాలపై అడ్డంకులు ఇవన్నీ వారి దైనందిన జీవితంలో భాగమయ్యాయి.

అంతర్జాతీయ ఐక్యత దినం ప్రపంచాన్ని ఒక్క ప్రశ్న అడుగుతుంది. ఒక జాతి యొక్క స్వేచ్ఛ, భద్రత, గౌరవం ఎందుకు పదేళ్ల తరబడి ప్రపంచ చర్చలలోనే నిలిచి పోయింది? శాంతి పేరుతో భూభాగాలు కోల్పోయిన ప్రజలు న్యాయం కోసం అరవడమే మిగిలింది. భద్రత పేరుతో అమాయకుల మృతదేహాలను నరబలి చేయడం కొనసాగుతోంది. ఒక భవనం ధ్వంసం అయితే అది ఇటుకల నష్టం మాత్రమే కాదుబీ ఒక కుటుంబ భవిష్యత్ భగ్నమవుతుంది. ఒక పిల్లవాడి స్కూల్ బాంబు దాడిలో మూసివేసినా అది విద్య నష్టం మాత్రమే కాదు, ఒక తరం నమ్మకం కూడా కోల్పోతుంది. ప్రపంచం ఇన్ని ఏళ్లుగా ఈ బాధను చూస్తూనే ఉంది. కానీ చర్యలు మాత్రం నెమ్మదిగా కదులుతున్నాయి.

ఈ రోజు ఐక్యతను ప్రకటించడం అంటే సానుభూతి మాత్రమే కాదుబీ ఇది న్యాయం కోసం మద్దతు ప్రకటించడం. పాలస్తీనా ప్రజల హక్కులు కేవలం భూభాగానికి సంబంధించినవి కాదుబీ అవి వారి గౌరవానికి, స్వాభిమానానికి, భవిష్యత్తు తరాల అవకాశాలకు సంబంధించినవి. ప్రపంచ రాజకీయాలు, సూపర్ పవర్ దేశాల ప్రయోజనాలు, ప్రాంతీయ మిత్రత్వాలు ఇవన్నీ ఒక్కసారిగా పక్కకు నెట్టాయనుకోండి. ఒకవేళ ఆ నేలలో నివసిస్తున్న సాధారణ ప్రజలు ఎలా జీవిస్తున్నారు అని చూసినా సరిపోతుంది. విచ్ఛిన్నమైన కుటుంబాలు, శిథిలాల మధ్య తల్లిదండ్రుల కోసం వెతుకుతున్న పిల్లలు, తమ ఇంటి నుండి తరిమివేయబడిన వృద్ధులు ఇవన్నీ మనసును కదిలించాల్సిన దృశ్యాలు. అయినా ప్రపంచం ఎక్కువగా పరిమిత ఆంతరంగిక సమావేశాలు, తీర్మానాలే చేస్తోంది కానీ ఆచరణలో మార్పు మాత్రం నిదానంగా ముందుకు సాగుతోంది.

మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి వాతావరణం నెలకొనాలంటే పాలస్తీనా సమస్య పరిష్కారం తప్పనిసరి. ఇది కేవలం యుద్ధం గురించి కాదుబీ ఇది ఒక జాతి గౌరవం గురించి. ఒక తరం నుండి మరో తరానికి చేరుతున్న బాధను ఆపాలని ప్రపంచం నిజాయితీగా కోరుకుంటే మాటలు కాదు, ధైర్యమైన నిర్ణయాలు అవసరం. పాలస్తీనా ప్రజల హక్కులు పునరుద్ధరించినప్పుడే ప్రపంచ రాజకీయాల విశ్వసనీయత నిలబడుతుంది. ఈ దినం ఒక్కరోజు మాత్రమే అయినా దానిలో దాగి ఉన్న సందేశం మాత్రం ఎనలేని బరువును మోస్తోంది ప్రపంచం ఇక మౌనం కాదు, న్యాయం కోసం నిలబడాలి. పాలస్తీనా భూమిపై శాంతి వెలిగే రోజు వచ్చినప్పుడే ఈ ఐక్యత దినానికి నిజమైన అర్థం దొరుకుతుంది. ఈ రోజు ఐక్యతను ప్రకటించడం అంటే సానుభూతి మాత్రమే కాదుబీ ఇది న్యాయం కోసం మద్దతు ప్రకటించడం. పాలస్తీనా ప్రజల హక్కులు కేవలం భూభాగానికి సంబంధించినవి కాదుబీ అవి వారి గౌరవానికి, స్వాభిమానానికి, భవిష్యత్తు తరాల అవకాశాలకు సంబంధించినవి. ప్రపంచ రాజకీయాలు, సూపర్ పవర్ దేశాల ప్రయోజనాలు, ప్రాంతీయ మిత్రత్వాలు ఇవన్నీ ఒక్కసారిగా పక్కకు నెట్టాయనుకోండి. ఒకవేళ ఆ నేలలో నివసిస్తున్న సాధారణ ప్రజలు ఎలా జీవిస్తున్నారు అని చూసినా సరిపోతుంది.

విచ్ఛిన్నమైన కుటుంబాలు, శిథిలాల మధ్య తల్లిదండ్రుల కోసం వెతుకుతున్న పిల్లలు, తమ ఇంటి నుండి తరిమివేయబడిన వృద్ధులు ఇవన్నీ మనసును కదిలించాల్సిన దృశ్యాలు. అయినా ప్రపంచం ఎక్కువగా పరిమిత ఆంతరంగిక సమావేశాలు, తీర్మానాలే చేస్తోంది కానీ ఆచరణలో మార్పు మాత్రం నిదానంగా ముందుకు సాగుతోంది. మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి వాతావరణం నెలకొనాలంటే పాలస్తీనా సమస్య పరిష్కారం తప్పనిసరి. ఇది కేవలం యుద్ధం గురించి కాదుబీ ఇది ఒక జాతి గౌరవం గురించి. ఒక తరం నుండి మరో తరానికి చేరుతున్న బాధను ఆపాలని ప్రపంచం నిజాయితీగా కోరుకుంటే మాటలు కాదు, ధైర్యమైన నిర్ణయాలు అవసరం. పాలస్తీనా ప్రజల హక్కులు పునరుద్ధరించినప్పుడే ప్రపంచ రాజకీయాల విశ్వసనీయత నిలబడుతుంది. ఈ దినం ఒక్కరోజు మాత్రమే అయినా దానిలో దాగి ఉన్న సందేశం మాత్రం ఎనలేని బరువును మోస్తోంది ప్రపంచం ఇక మౌనం కాదు, న్యాయం కోసం నిలబడాలి. పాలస్తీనా భూమిపై శాంతి వెలిగే రోజు వచ్చినప్పుడే ఈ ఐక్యత దినానికి నిజమైన అర్థం దొరుకుతుంది.

# 50% రాయితీతో పశువుల దాన పంపిణీ




మన గళం డోన్ పాడి సంపద పెంపొందించే దృష్టిలో ప్రభుత్వం 50% రాయితీతో పాడి పశువులకు సమీకృత దాణా సరఫరా చేస్తుంది. కావునస్థానిక ప్రాంతీయ పశు వైద్యాశాల నందు పాడి రైతులకు రెవిన్యూ డివిజనల్ అధికారి%ఖ్రా% నరసింహులు, మరియు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. నాగరాజు, దాణాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 50 కేజీల దాణాను సంచి పూర్తి ఖరిదు రూ.1110/- సబ్సిడీ పోను రైతు చెల్లించవలసినది 555/- రూపాయలు. డోన్ మండలానికి 160 సంచులు సరఫరా చేయడం జరిగింది.ఈ యొక్క దాణాలో 20% మాంసకృతులు ఉంటాయి, కాబట్టి పాడి పశువులకు పెట్టడం వలన పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. రైతులు గుర్తించుకోవాల్సిన విషయంలో ఈ దాణా పెళ్ళేట్ (గులికల) రూపంలో ఉంటుంది. కాబట్టి పశువులకు వేసేటపుడు గంట ముందు నానబెట్టి పెట్టాలి. పెయ్య దూడల ఉత్పత్తి పథకం పై పాడి రైతుల అవగాహన సదస్సు రాష్ట్రంలో మేలు జాతి పెయ్య దూడలు ఉత్పత్తికి ప్రభుత్వము మార్పులు తీసుకొచ్చింది. పశు సంపదను గణనీయంగా వృద్ధి చేయడము, పాల ఉత్పత్తి పెంచడం లక్ష్యంగా లింగ నిర్ధారిత వీర్యం ఇంజక్షన్ పంపిణీ ప్రారంభించడం జరిగింది. గేదెలు, ఆవులు పెయ్య దుడలకు మాత్రమే పుట్టెల చేయడం దీని ఉద్దేశం,రైతులు కేవలం 150 రూపాయలు ప్రభుత్వ లింగ నిర్ధారిత వీర్యాన్ని అందిస్తుంది.గతంలో సాధారణ వీర్యం వల్ల మగ, ఆడ దూడలు దాదాపు సమాన సంఖ్యలో పుట్టేవి. లింగ నిర్ధారిత వీర్యాన్ని ఇంజక్షన్ల ద్వారా ఎక్కిస్తే 90% పెయ్య దూడలు పుట్టేందుకు అవకాశం ఉంటుంది. పెయ్య దూడ పెరిగి మూడున్నర ఏళ్లకు గర్భం దాల్చిన నాటికి దాని విలువ లక్షకు చేరుతుంది. అప్పటినుంచి ఏటా ఒక్క పేయ దూడను ఈనుతుంది. పాల ఉత్పత్తి పెరుగుతుంది. ఈ కార్యక్రమంలో%ాూాూ% మహమ్మద్ రఫీ, %ూానాూ% నవ్య సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



# యువకుడు వేధిస్తున్నాడని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

మనగళం, అమరావతి : ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా సీకే పల్లిలో విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. గత కొన్ని రోజులుగా యువకుడు వేధిస్తున్నాడని విద్యార్థిని ధర్మవరం పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసు తమ పరిధిలోకి రాదని సీకే పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయాలని అక్కడి పోలీసులు ఆమెకు సూచించారు. పైగా కేసు నమోదు చేయకుండా సీకేపల్లి పోలీసులు తమ పట్ల దుర్భాషలాడారన్న మనస్తాపంతో విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తండ్రి ఆమెను కిందకు దించి అనంతపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె పరిస్థితి విషమం మారింది. బెంగళూరులో వైద్యం చేయించాలని అనంతపురం వైద్యులు సూచించగా ఆర్థిక స్థోమత లేదని యువతి తండ్రి ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఆమెకు అనంతపురంలోనే చికిత్స అందిస్తున్నారు.

## రేపు శనివారం ఎమ్మెల్యే కలెక్టర్ చెరువుల పరిశీలన




మన గళండోన్ నియోజకవర్గం లో శనివారంఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గనియ రేపు ఉదయం 9:30 గంటలకు డోను మండలంలోని వెంకటాపురం తుమ్మలచెరువు, ప్యాపిలి మండలంలోని వెంగళం పల్లె చెరువు, గుడిపాడు చెరువు, చంద్ర పల్లె చెరువు, హుసేనాపురం చెరువులను పరిశీలించడానికి వస్తున్నారని టిడిపి పార్టీ కార్యాల ప్రతినిధులు మీడియాకు తెలిపారు కావున ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# బీఎస్పీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి



మనగళం, ఆదోని : ఆదోనిలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి బహుజన సమాజ్ పార్టీ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి మలిగే రామలింగయ్య, కర్నూలు జిల్లా సలహాదారుడు కే శాంతరాజు, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పూలే త్యాగాలను ఈ సందర్భంగా మలిగే రామలింగయ్య, శాంతరాజు గుర్తు చేశారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమానికి ఆయన విగ్రహావిష్కరణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

# అన్నదాత అభ్యున్నతే లక్ష్యం

- నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి





మనగళం, దొర్నిపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం దొర్నిపాడు మండలం గుండుపాపుల గ్రామం సందర్శించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రైతులతో ముచ్చటించారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా... సాగు ఎలా చేస్తున్నారు... ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా తదితర విషయాలను కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాల లబ్ధి అందుతున్న విధానంపై రైతులు వెంకటేశ్వర్లు, చిన్న దస్తగిరిని వివరాలు అడిగారు. మొదటి విడతలో అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000, రెండో విడతలో మరోసారి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000 చొప్పున మొత్తం రూ.14,000 తమ ఖాతాల్లో జమ అయ్యాయని రైతులు కలెక్టర్ కు నివేదించారు. ఇంకా రైతులకు ఎలాంటి మద్దతు అవసరమో తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా లభించే అవకాశాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం, ఎరువుల వినియోగం, ప్రత్యేకంగా యూరియా సరైన విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కోయిలకుంట్ల వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, దొర్నిపాడు తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, స్థానిక సర్పంచ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహలను అరికట్టాలి

మనగళం, మార్కాపురం మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ కె. నయోమి అధ్యక్షతన గురువారం రాత్రి ఆక్సిస్ జస్టిస్, సార్డ్స ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనకు బాల్య వివాహలను అరికట్టాలని 100 రోజులు అవగాహన కార్యక్రమలో భాగంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కమ్యూనిటీ సోషల్ వర్కర్ కె నయోమి మాట్లాడుతూ బాల్య వివాహల నిర్మూలనకు బాల్య వివాహ రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ నాగరాజు

మనగళం, విజయవాడ : విజయవాడలో వెలసిన కనక దుర్గమ్మ అమ్మవారిని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనార్థం ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కనకదుర్గమ్మ దర్శించుకున్న ఎంపీ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వేదపండితులు ఎం.పి నాగరాజుకు వేదాశీర్వచనాలను అందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేసవస్త్రాలను , చిత్రపటాన్ని అందచేశారు. అదేవిధంగా రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, దిశ కమిటీ సభ్యుడు దేవశంకర్, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.



# "దిత్వా" తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలు కురిసే అవకాశం - ధాన్యాన్ని తార్పాలిన్ షీట్లు వేసి రక్షించుకోవాలి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మనగళం, నంద్యాల : బంగాళాఖాతంలో ఏర్పడిన "దిత్వా" వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఈ ప్రభావం నంద్యాల జిల్లాలో అధికంగా ఉండే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. శనివారం, ఆదివారం, సోమవారం మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి పంటల కోత పనులను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోత కోసిన పంటను తార్పాలిన్ షీట్లు వేసి రక్షించుకోవడం, వర్షాకాలంలో తేమకు గురికాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పంట దిగుబడిని ఆరుబయట కాకుండా, తప్పనిసరిగా గోడౌన్లలో లేదా భద్రమైన గదుల్లో నిల్వ చేసుకోవాలన్నారు. వర్షాల సమయంలో ప్రజలు విద్యుత్ తీగలు, చెట్లు, నీటితో నిండిన రహదారులు వద్ద జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే సమీప గ్రామ వాలంటీర్లను, సంబంధిత తహసీల్దార్ లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు



సహాయం అందించేలా సిద్ధంగా ఉందని తెలిపారు.

# రైతులను మోసం చేస్తున్న మార్కెట్ యాడ్ అధికారులు





మన గళం కోడుమూరు: రైతులకు సిసిఐ మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 8110 రూపాయలు ప్రకటించడం జరిగింది. అయితే మార్కెట్లో మాత్రం రైతులకు మద్దతు ధర కల్పించకుండా వారికి ఇష్టం వచ్చినట్టు రేట్లు వేస్తూ రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ. సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం మద్దతు ధర 8110 రూపాయలు కల్పిస్తే మార్కెట్లు అధికారులు మాత్రం రైతులకు చిన్న చూపు చూస్తూ మద్దతు ధర కల్పించకుండా రైతుల మోసం చేస్తున్నారు తడి తేమ తేమతో రైతులకు రేపు రాపో ఈరోజు రాపో అని కాలయాపన చేస్తూ మోసం చేస్తున్నారని వారన్నారు తక్షణమే సిసిఐ మద్దతు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని వారన్నారు మార్కెట్ యార్డులలో దళారుల పెత్తనం చెలాయిస్తూ రైతులను ఇబ్బంది కలిగిస్తున్న రైతులు దూర ప్రయాణం చేస్తూ పత్తి కొనుగోలుకు వస్తే తేమ ఉంది అని కారణంతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు తక్షణమే అధికారులు స్పందించి రైతులకు మద్దతు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు అనంతరం పెంచుకులపాడు మార్కెట్ యాడ్ చైర్మన్ సుందర్ రాజుకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు సుందరాజు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# క్లైమ్ చేయని డబ్బు తిరిగి పొందవచ్చు

- మీ డబ్బు మీ హక్కు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం
- లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర కువ




మనగళం, నంద్యాల : మీ డబ్బు మీ హక్కు కార్యక్రమం ద్వారా గత 10 సంవత్సరాల నుంచి క్లైమ్ చేయని డబ్బు తిరిగి పొందవచ్చునని జిల్లా లేట్ బ్యాంక్ మేనేజర్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు మీ డబ్బు మీ హక్కు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ... వివిధ బ్యాంకుల ఖాతాదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్బీఐ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని బ్యాంకులు సమన్వయంతో మీ డబ్బు మీ హక్కు అనే కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. గత 10 సంవత్సరాల నుంచి క్లైమ్ చేయనటువంటి మీ ఖాతాలలో ఉండే డబ్బు రిజర్వ్ బ్యాంకుకు వెళ్లడం జరిగిందన్నారు. మన జిల్లాలో సుమారు 64.59 కోట్ల రూపాయలు 3.19 లక్షల మంది అకౌంటులలో ఉన్నందున ఈ డబ్బు అంతా ఆర్.బి.ఐ లో సేఫ్ గా ఉందన్నారు. ఈ డబ్బును మనం తిరిగి ఉపయోగించుకోవడానికి ఆర్బీఐ ఆదేశాల మేరకు మీ డబ్బు మీ హక్కు అనే కార్యక్రమం ద్వారా ఏ బ్యాంకుకు సంబంధించిన ఖాతాదారులకు ఆ బ్యాంకు తరపున స్టాల్స్ ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డ్వామా, మెప్మా పీడీలు, ఎస్బీఐ చీఫ్ మేనేజర్ మనోహర్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి, వివిధ బ్యాంకుల ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్కర్,ఆయాలను విధుల్లోకి తీసుకోవాలి

మనగలం, ఆదోని : ఆదోని మండలం,నాగలాపురం గ్రా మంలో ఫుడ్ పాయిజన్ తో ఇద్దరి పిల్లలు అస్వస్థతతో హాస్పి టల్ పాలయ్యారనే కారణంగా వ ర్కర్ పుష్పావతి,ఆయాలను విచారణ లేకుండా టేర్మినేషన్ చే యడం సరైంది కాదని, వారిని వీధులలోకి తీ సుకోవాలని అంగ న్వాడీ యూనియన్ జిల్లా గౌర వాధ్యక్షురాలు పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.యస్.రాధాక్రి ష్ణ, కార్యదర్శి అంజిబాబు, కోశాధి కారి ఎం.గోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక కేకే భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో వారు మాట్లాడారు. ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో జరిగిన సంఘటన బాధాకరమైనది. ఆ సం ఘటనకు అంగన్వాడీ వర్కర్, ఆయా లపై టర్మినేషన్ లాంటి కఠిన చర్య తీసుకోవడం సరైనది కాదన్నారు. ఆరోజు 18 మంది పిల్లలు అక్కడ తినడం జరిగింది. అందు లో ఇద్దరికి మాత్రమే తీవ్ర అస్వస్థ తకు గురికావడం హాస్పిటల్ లో చేరడం జరిగింది. మిగిలిన వారికి ఏమి కాలేదంటే ఫుడ్ పాయిజన్ కాలేదని అర్థమవుతుంది. ఫుడ్ పాయిజన్ అయితే పిల్లలందరికీ ఏదో ఒక స్థాయిలో అస్వస్థకు గుర వుతారు. ఇటువంటి వాటిని అధికారులు పట్టించుకో కుండా,సంబంధిత అధికారులు పూర్వపరాలు లోతుగా విచా రించకుండా ఆగమేఘాలపై చర్య లు తీసుకోవడం సమంజసం కాదన్నారు. టెర్మినేట్ ను ఉప సంహారించు కోవాల్సినదిగా విజ్ఞప్తి చేస్తున్నామని, లేని పక్షంలో జిల్లా వ్యా ప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# రైతన్న.. మీకోసం. ఐదవ రోజు పాల్గొన్న మండల టిడిపి నాయకులు

- అన్నదాత సుఖీభవ గురించి అవగాహన కల్పిస్తున్న మండల టిడిపి నాయకులు..





నందవరం నవంబర్ 28 మనగళం న్యూస్ : నందవరం మండల పరిధిలోని స్థానిక నాగలదిన్నె గ్రామంలో మరియు కనకవీడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం మరింత దూకుడు పెంచింది సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్ మండల టిడిపి కన్వీనర్ కాసి%శీ%వాలి సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపాల్ ఎమ్మిగనూరు మార్కెట్ చైర్మన్ మల్లయ్య కనకవీడు గ్రామ అధ్యక్షులు డబ్బా ఈరన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మరియు ఎమ్మిగనూరు నియోజకవర్గ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 'రైతన్నా.. మీ కోసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఇళ్లకు నేరుగా వెళ్లి ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు 'పంచసూత్రాల' అమలు ద్వారా కలిగే లాభాలను వివరించనున్నారు. రైతులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ఈ విధానాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకున్నారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయం, అనుబంధ శాఖలు, మార్కెటింగ్ అధికారులు, సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పంచసూత్రాలు %-% నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు %-% అమలుపై లోతైన చర్చ జరిగింది. రైతు సేవా కేంద్రాల సిబ్బంది ముందుండి ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయాలని సీఎం ఆదేశించారు. సీఎం మాట్లాడుతూ గత 17 నెలలుగా రైతులు, వ్యవసాయాన్ని ముందుకు తీసుకొచ్చాం. 'అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్' కింద 46.50 లక్షల మంది రైతులకు రూ.14 వేల చొప్పున జమ చేశాం. బిందు సేద్యం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలతోపాటు ఇప్పుడు పంచసూత్రాలతో రైతులకు మరింత మేలు చేకూరుస్తున్నాం. పాడి, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం, ఆక్వా, ఉద్యానవన, సెరికల్చర్ రంగాల రైతులకు కూడా ఈ అవగాహన అందాలి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి, భూసార రక్షణతోపాటు ఆరోగ్యాన్ని కాపాడాలి. రైతు బజార్లలో ప్రకృతి ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం కల్పించాలి" అని పేర్కొన్నారు. పురుగుమందుల అధిక వినియోగం నష్టాలు, సేంద్రీయ విధానం ద్వారా విదేశీ మార్కెట్లలో డిమాండ్, భూసార పరీక్షలు, సమర్థ నీటి నిర్వహణ,



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి అంశాలను రైతులకు ఇంటింటా వివరించాలని సీఎం ఆదేశించారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి, రైతుల సమస్యలు నేరుగా తెలుసుకునేలా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. మండల క్లస్టర్ ఇంచార్జి వన్ వీరేష్ సత్తిరెడ్డి. మరియు నాగలదిన్నె గ్రామ టిడిపి నాయకులు మరియు కనకవీడు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

**– ఐవిఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవ – జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ అంశాలపై ఆర్డీఓ లతో, తహసీల్దార్, సర్వేయర్ లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ఎక్కువగా రెవెన్యూ, సర్వే కు సంబంధించిన అర్జీలు వస్తున్నాయని, వాటిని డ్రైవ్ మోడ్ లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్ టూ వ్యూ లో అర్జీలు పెండింగ్ లో లేకుండా చూడాలని చెప్పినప్పటికీ కూడా మండల సర్వేయర్, వెల్దుర్తి లాగిన్ లో 3 రోజుల నుండి 2 అర్జీలు, సి. బెలగల్, తహసిల్దార్ వద్ద 10 రోజుల నుండి 1 అర్జీ, తహసిల్దార్, కల్లూరు, ఎమ్మిగనూరు ల వద్ద 3 రోజుల నుండి 1 అర్జీ చూడకుండా పెండింగ్ లో ఉన్నాయని కలెక్టర్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని పెండింగ్ లో ఉండకూడదన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి ఏ అర్జీ వచ్చింది? సంబంధిత అర్జీకి ఎటువంటి చర్యలు తీసుకోవాలి? ఏ విధంగా పరిష్కరించాలనే విధంగా ప్రణాళిక ఉండాలన్నారు. లాగిన్ లో ఇన్ ప్రోగ్రెస్ లో ఉన్న అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏ ఇంకా సమయం ఉందని పెండింగ్ లో పెట్టకుండా నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ సమయం దగ్గరికి వచ్చినపుడు హడావిడి గా పరిష్కరించడం ద్వారా రీ ఓపెన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మీ సేవ, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన 22 ఏ లో మార్పులకి సంబంధించి వచ్చిన అర్జీలను త్వరితగతిన వెరిఫై చేసి పంపాలన్నారు. సర్వేయర్ లు సర్వే చేసేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆర్ఓఆర్ కు సంబంధించి విఆర్ఓ లు డబ్బులు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు ఐవిఆర్ఎస్ కాల్స్ లో వస్తున్నాయన్నారు. ఇలాంటి ఫిర్యాదులు మరలా పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవన్నారు. అధికారుకు పనితీరును మెరుగుపరచుకుని ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. జాయింట్ ఎల్పీఎం, అలియనేషన్, కోర్ట్ కేసులకు సంబంధించి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు పై రివ్యూ మీటింగ్

మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు కోర్టు కాంపౌండ్ లోని న్యాయ సేవా సదన్ లో శుక్రవారం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులుపై జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. లీలా వెంకట శేషాద్రి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు, పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు. అలాగే ఎన్ని కేసెస్ లలో బెల్స్ మంజూరు చేశారు, కేసుల యొక్క స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఏ. సులోచన,సిబ్బంది పాల్గొన్నారు.



# జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు రెండు నెలలు పొడిగింపు

మనగళం, కర్నూలు సిటీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో రెండు నెలలు పాటు పొడింగిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్ ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 01. 2025 నుండి జనవరి 31, 2026 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గాని ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం నవంబర్, 30 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేయుచున్న పాత్రికేయులకు మాత్రమే మరో రెండు నెలలు పాటు డిసెంబర్ 01. 2025 నుండి జనవరి 31, 2026 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు తెలియజేశారు.

# ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి దుర్మరణం.






మనగలం –: బ్రహ్మగిరి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన పాతాళ గంగ గ్రామంలో చోటు చేసుకున్నది వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రాల్లగూడ గ్రామానికి చెందిన యాదయ్య వయసు 45 సంవత్సరాలు కురుమ కులము తన ఇద్దరు స్నేహితులతో కలిసి శ్రీశైలం దర్శనం కోసం బయలుదేరాడు ముందు రోజు మన్ననూరులో బస చేసి ఉదయం పాతాళ గంగ వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు దుర్మరణం చెందడం జరిగింది మృతుడు యాదయ్యకు భార్య ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నారు మృతుడు కుమారుడు సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈగలపెంట ఎస్సై జయన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

# ఆలూరు ఎంపీడీఓ ను కలిసిన కురుకుంద గ్రామ టీడీపీ అధ్యక్షుడు పులికేశవ రెడ్డి.







( ఆలూరు మనగళం ): ఆలూరు మండలం, కురుకుంద గ్రామంలో టీడీపీ అధ్యక్షులు పులి కేశవ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ కాలినిలో శ్రీ శనేశ్వర స్వామి దేవాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిలో సిమెంట్ పైపు పగిలి పోయింది. దాదాపు తొమ్మిది నెలల నుండి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కల్వర్ట్ నిర్మించాలని, వర్షపు నీరు, డ్రైనేజి నీరు ఈ పైపు ద్వారానే పోవాలి కావున శాశ్వతంగా ఉండేలా కల్వర్ట్ ను నిర్మించాలని, ఆలూరు మండల అభివృద్ధి అధికారి మద్దిలేటి స్వామి కు వినతి పత్రం అందజేసిన కురుకుంద గ్రామ టీడీపీ అధ్యక్షులు పులి కేశవ రెడ్డి. సందర్భంగా ఎంపీడీఓ మద్దిలేటి స్వామి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుకుంద గ్రామ టీడీపీ ఉపాధ్యక్షులు బోయ శ్రీనివాస్, విద్యా కమిటీ ఛైర్మెన్ వాల్మీకి శ్రీ రాములు, వెంకటేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే వర్ధంతి



మనగళం, కర్నూలు సిటీ : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కర్నూల్ కొత్త బస్టాండ్ దగ్గర గల ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబాపూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం న్యూ సిటీ కార్యదర్శి సి శేషాద్రి అధ్యక్షతన జరిగిన సభ లో ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ పూలే త్యాగాలను కొనియాడారు. మహాత్మ జ్యోతిబాపూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసారన్నారు. 1873 సెప్టెంబరు 24న ఫులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేసి అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసారన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకురాలు విజయమ్మ, రజక వృత్తిదారుల సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పుష్ప, శేఖర్ బాబు, జిల్లా నాయకులు కృష్ణ, పరుశురాం, డప్పు సంఘం నాయకులు బతకన్న పాల్గొన్నారు.

# జోగుళాంబాను దర్శించుకున్న జిల్లా కలెక్టర్



మనగళం, కర్నూలు సిటీ : తెలంగాణ రాష్టం, అలంపూర్ క్షేత్రంలో వెలసిన జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామి, అమ్మవార్ల ను కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి దర్శించుకున్నారు. భర్త డా.సురేష్ కుమార్, కుమారుడు కార్తికేయ తో కలిసి కలెక్టర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చన, అభిషేక పూజాదికాలను నిర్వహించారు.

## ఏడాదికి రూ.436 చెల్లిస్తే కుటుంబానికి రూ.2 లక్షల రక్షణ

హైదరాబాద్, నవంబర్ 28, మన గళం: తక్కువ ఖర్చుతో కుటుంబ భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. సంవత్సరానికి కేవలం రూ.436 ప్రీమియం చెల్లిస్తే%ొ%పాలసీదారుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.2 లక్షల వరకు బీమా మొత్తం లభిస్తుంది. సామాన్యుల కోసం రూపొందించిన ఈ జీవిత బీమా పథకం 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల బ్యాంకు సేవింగ్స్ ఖాతాదారులకు అందుబాటులో ఉంది.

ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే తక్కువ ప్రీమియం, సులువైన నమోదు ప్రక్రియ, వంద శాతం పేపర్‌లెస్ విధానం, వైద్య పరీక్షలు అవసరం లేకపోవడం. ఇండియా పోస్ట్ బ్యాంక్ సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల సేవింగ్స్ ఖాతాదారులు ఈ బీమాకు అప్లై చేసుకోవచ్చు. సభ్యులు 55 ఏళ్ల వయస్సు వరకు జీవిత బీమా కవరేజ్ పొందే అవకాశం ఉంటుంది.

ఈ బీమా కవర్ ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు అమల్లో ఉంటుంది. ఖాతాదారులు ఆటో డెబిట్ విధానంలో తమ సేవింగ్స్ ఖాతా నుంచి రూ.436 ప్రీమియాన్ని చెల్లించేందుకు మే 31లోపు సమ్మతి ఇవ్వాలి. జూన్ 1 తరువాత చేరిన వారికి, వారు దరఖాస్తు చేసిన తేదీ నుంచే బీమా ప్రారంభమై వచ్చే ఏడాది మే 31తో ముగుస్తుంది. ఒకే ఉమ్మడి బ్యాంక్ ఖాతా ఉన్నా, ప్రతి ఖాతాదారుడు వేర్వేరుగా ప్రీమియం చెల్లిస్తే ఒక్కొక్కరికి రూ.2 లక్షల కవరేజ్ లభిస్తుంది. అంతేకాదు రూ.436 మొత్తాన్ని ఒకేసారి చెల్లించలేని వారికి సులభ?యిదాలుగా మూడు నెలలకు ఒకసారి చెల్లించే వెసులుబాటును కూడా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కల్పించింది.

గడువు ముగిసిన తర్వాత పునరుద్ధరణ చేయని పాత సభ్యులు తిరిగి నమోదు చేసుకుంటే, వారిని కొత్త సభ్యులుగా పరిగణించి కొత్త నంబర్ కేటాయిస్తారు. తొలిసారి నమోదు చేసుకునే వారికి 30 రోజుల వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. ఈ కాలంలో ప్రమాదవశాత్తు మరణానికి మాత్రమే బీమా మొత్తం వర్తిస్తుంది.

తక్కువ ఖర్చుతో పెద్ద రక్షణ అందిస్తున్న ఈ పథకం ఇప్పుడు ఎంతోమంది కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది.

# కోడుమూరులో కోటి సంతకాల సేకరణ



మన గళం కోడుమూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని, ప్రజల స్పందన చూసైనా ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కుడా మాజీ చైర్మన్ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా కోడుమూరులో సంతకాలు పూర్తి చేసి పత్రాలు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, ప్రజలకు హర్షవర్ధన్ రెడ్డి సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపుతో చేపట్టిన ఏ కార్యక్రమమైనా కోడుమూరు నియోజకవర్గంలో ఘనవిజయం సాధిస్తుందని, ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సమన్వయంతో చేపట్టామన్నారు. ప్రజలు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయడం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు చేతుల్లోకి వెళితే పేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు . అందుకే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరసన తెలుపుతున్నారని ఆయన తెలిపారు. గ్రామ, మండల నాయకులు రోజూ కష్టపడి పనిచేయడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలిగామన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు కీలకపాత్ర పోషించారని కోట్ల హర్షవర్ధన్ రెడ్డి గారు, డాక్టర్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమించాలి




మనగళం, ప్రత్యేక ప్రతినిధి : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, శాస్త్రీయ విద్యా విధానం కోసం విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని ఏకేవన్ యూ పూర్వ తెలుగు భాష అధ్యక్షులు టి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 24వ మహాసభలు రాజ మహేంద్రవరం నగరంలోని డా బిఆర్ అంబేద్కర్ భవన్ (భగత్ సింగ్, అల్లూరి ,జార్జి , జంపాలనగర్) శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా పీడీఎస్ యూ జెండాను రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ ఎగురవేశారు. ఈ మహాసభలను ప్రారంభించిన ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 950కు పైగా ఉన్న యూనివర్సిటీలలో వేలాది ప్రొఫెసర్, లెక్చరర్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనితో యూనివర్సిటీ విద్య సంక్షోభంలో కూరుకు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొఠారి కమిషన్1968 లోనే కేంద్ర బడ్జెట్లో10శాతం, రాష్ట్ర బడ్జెట్లో30 శాతం, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని సూచించినా ఏ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు.
యూనివర్సిటీలలో కులవివక్ష రాజ్యమేలుతోందని అన్నారు. దేశభక్తి యుత భావాలను పెంపొందించుకుని శాస్త్రీయ విద్యా సాధన కోసం, ప్రభుత్వ విద్యా రంగ రక్షణ కోసం విద్యార్థులు పోరాడాలని పిలుపు నిచ్చారు.
సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు పి. టాన్యా మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాద కార్పొరేటీకరణ విధానాలను అమలు చేస్తున్నదన్నారు.



ఎల్ ఐ సి, బ్యాంకులు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతుందని అన్నారు. పీడీఎస్ యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలకు పైగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్ యూ నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కాలేజ్లను ప్రైవేట్ పరం చేయడాన్ని విరమించుకోవాలని, పెండింగ్లో ఉన్న 6,800 కోట్లు ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్ యూ 24వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం తరపున జాతీయ నాయకులు యు. గనిరాజు మాట్లాడారు. ముందుగా పీడీఎస్ యూ విప్లవ విద్యార్థి ఉద్యమంలో నేలకొరిగిన కామ్రేడ్స్ జార్జి రెడ్డి, జేసీయస్ ప్రసాద్ కోలా శంకర్, చేరాలు, సాంబయ్య వరహాలు, రంగవల్లి వంటి విద్యార్థి అమరవీరుల కు జోహార్లు నేర్పిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ .కిరణ్ కుమార్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహాసభ రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. ఈ మహాసభ సందర్భంగా విధ్యా గోష్టిలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి ధర్మారెడ్డి మాట్లాడారు. పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్సులు ఎం. వెంకటరెడ్డి, ఏ. సాంబ, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు టీ ప్రకాష్, పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి చిట్టిబాబు, పివోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి విజయ, ఐఎఫ్ టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి భీమశంకర్, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను ప్రసాద్, సహాయ కార్యదర్శి సిద్దు, రాష్ట్ర కోశాధికారి రూప రాష్ట్ర నాయకులు నాగరాజు ,షాహిద్ సోము ,చంద్రశేఖర్, శ్రీను, వేణు తదితరులు ప్రసంగించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల ఆట పాటలు అలరించాయి.

## డిసెంబరు 13న హైదరాబాద్‌లో మెస్సీ సందడి..



హైదరాబాద్, నవంబరు 28 :శా-0 మనగళం,: ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ త్వరలో హైదరాబాద్‌లో అడుగుపెట్టబోతున్నాడు. డిసెంబరు 13న నగరానికి రానున్న అతను, ఫుట్‌బాల్ ప్రేమికులతో కలసి ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నట్లు సమాచారం. అర్జెంటీనా జట్టు తరఫున ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించిన మెస్సీ భారతదేశంలో పర్యటించనున్న క్రమంలో హైదరాబాద్‌ను కూడా తన పర్యటనలో చేర్చడంతో నగరంలో క్రీడాభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.

ఇటీవల తన సామాజిక మాధ్యమ వేదికలో మెస్సీ ఈ విషయాన్ని ధృవీకరించడంతో అభిమానుల్లో ఆనందోత్సాహాలు మొదలయ్యాయి. భారత్‌లో తనకు లభిస్తున్న అపూర్వ ప్రేమాభిమానాల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలతో పాటు హైదరాబాద్‌లో కూడా ప్రజల మధ్యకు వచ్చి వారితో మమేకం కానున్నానని పేర్కొన్నారు. డిసెంబరు 13 సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు.

మరోవైపు మెస్సీ రాకను స్వాగతిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్ ఫుట్‌బాల్ ప్రేమికులకు ఇది మరిచిపోలేని క్షణమని పేర్కొన్నారు. నగరానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువచ్చే ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇప్పటికే నగరంలోని వివిధ వర్గాలు, యువత, క్రీడాభిమానులు ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కోరుతున్నారు.

ప్రపంచ క్రీడారంగంలో మెస్సీకి ఉన్న అభిమాన గణం దృష్ట్యా హైదరాబాద్‌లో నిర్వహించే ఈ కార్యక్రమం చారిత్రాత్మకంగా మారుతుందని క్రీడావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నగరానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చిపెట్టే ఈ సందర్శనతో యువతలో క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

## రెండో టెస్టుకూ కమిన్స్ దూరం.. స్మిత్‌కే సారథ్యం

బ్రిస్బేన్, నవంబర్ 28, మనగళం,: యాషెస్ సిరీస్‌లో అదిరే ఆరంభంతో ఇంగ్లండ్‌పై పైచేయి సాధించిన ఆస్ట్రేలియా రెండో టెస్టులోనూ అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 1-0 ఆధిక్యం సాధించిన కంగారూ జట్టు, బ్రిస్బేన్ గబ్బా వేదికగా జరిగే రెండో టెస్టుకు సన్నద్ధమైంది. అయితే ఈ కీలక పోరుకు ముందే ఆస్ట్రేలియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌తో పాటు ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ ఇంకా పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యారు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో కమిన్స్, హేజిల్‌వుడ్ లేకపోయినా ఆసీస్ ఆటగాళ్లు అద్భుతంగా రాణించారు. మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్‌లు ఇంగ్లండ్ బ్యాటింగ్‌ను నిలువరించడంతో ప్రత్యర్థి జట్టు రెండో రోజే ఆలౌట్‌గా నిలిచింది. ముఖ్యంగా ట్రావిస్ హెడ్ ఆడిన విధ్వంసక శతకం మ్యాచ్‌ను తొందరగా ముగించడంలో కీలక పాత్ర పోషించింది. ఇక రెండో మ్యాచ్‌లో కూడా జట్టుకు నాయకత్వం వహించే బాధ్యతను స్టీవ్ స్మిత్‌కి అప్పగించారు. మొదటి టెస్టులో సారథిగా వ్యవహరించిన ఆయన అదే కొనసాగించనున్నాడు. కమిన్స్ మ్యాచ్‌కు దూరమైనప్పటికీ జట్టుతోనే ఉండి సాధన కొనసాగించనున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో వెన్నునొప్పితో ఇబ్బంది పడ్డ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా కూడా రెండో టెస్టు స్క్వాడ్‌లోనే కొనసాగుతున్నాడు. అతని ఫిట్‌నెస్‌పై జట్టు మేనేజ్‌మెంట్ నిశితంగా పరిశీలిస్తోంది. డిసెంబర్ 3 నుంచి గబ్బాలో మొదలయ్యే ఈ మ్యాచ్‌లో కూడా ఆస్ట్రేలియా విజయం సాధిస్తే సిరీస్‌పై పట్టు మరింత బలపడనుంది. ఈ రెండో టెస్టుకు ఎంపికైన ఆస్ట్రేలియా జట్టులో స్టీవ్ స్మిత్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, స్కాట్ బొలాండ్, అలెక్స్ క్యారీ, బ్రెండన్ డొగెటే, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబూషేన్, నాథన్ లియాన్, మైఖేల్ నాసిర్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్‌లాండ్, బ్యూ వెబ్‌స్టర్ ఉన్నారు.

# టీమిండియా-శ్రీలంక తొలి సిరీస్.. వైజాగ్, త్రివేండ్రం వేదికలు

ముంబై, నవంబర్ 28 ,మనగళం,: తాజాగా విశ్వ విజేతగా అవతరించిన టీమిండియా మళ్లీ మైదానంలో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. స్వదేశంలోనే ప్రపంచకప్‌ను గెలుచుకున్న హర్మన్‌ప్రీత్ సేన, తన తొలి ద్వైపాక్షిక సిరీస్‌లో ఉపఖండ ప్రత్యర్థి శ్రీలంకను ఎదుర్కొననుంది. డిసెంబర్‌లో జరుగనున్న ఈ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ సిరీస్‌కు రెండు నగరాలైన వైజాగ్ (విశాఖపట్టణం), త్రివేంద్రం (తిరువనంతపురం)లను వేదికలుగా ఎంపిక చేసింది.

వరల్డ్ కప్ తర్వాత భారత్, శ్రీలంక జట్లు తలపడుతున్న తొలి సిరీస్ ఇదే కావడంతో అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. స్వదేశంలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా, లంకతో జరిగే ఈ సిరీస్‌లో కూడా ఆధిపత్యం చెలాయించాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, కొంతకాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో ఫామ్ కోసం తపిస్తున్న శ్రీలంక జట్టు, ఈ సిరీస్ ద్వారా మళ్లీ నిలకడ చూపించాలని ఆత్రుతగా ఎదురుచూస్తోంది.

డిసెంబర్ 21 నుంచి డిసెంబర్ 30 వరకు ఈ సిరీస్ జరగనుండగా, వైజాగ్‌లో తొలి రెండు మ్యాచ్‌లు, త్రివేంద్రంలో మిగతా మూడు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. విశాఖపట్టణం మైదానంలో ఇప్పటికే అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం ఉన్నా, మహిళల భారీ టీ20 సిరీస్‌కు మరోసారి ఆతిథ్యం ఇవ్వడం ప్రత్యేకంగా నిలుస్తోంది. అలాగే, కేరళ రాజధాని త్రివేంద్రం కూడా ఈ మూడు కీలక మ్యాచ్‌లతో అభిమానులకు క్రికెట్ పండుగను అందించనుంది. టీమిండియా ఈ ఏడాది జూన్‌లో చివరిసారిగా ఇంగ్లండ్‌తో పొట్టి ఫార్మాట్ సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో ఉత్కంఠ భరితంగా 3-2తో విజయం సాధించి జోరు మీద కొనసాగుతోంది. ఇక శ్రీలంక జట్టు విషయానికి వస్తే, మార్చిలో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఆఖరిసారిగా బరిలోకి దిగింది. ఆ సిరీస్ 1-1తో సమం కావడంతో, భారత్‌తో జరిగే ఈ సిరీస్‌పై వారు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.




Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.